ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జయశంకర్ భూపాలపల్లి
శనివారం 4 జనవరి 2025

చిన్నారులను ఆకట్టుకునేలా..!



రేగొండ మండలం రేపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పూర్వ ప్రాథమిక పాఠశాలగా పేరు మార్చిన దృశ్యం

- పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా అంగన్‌వాడీ కేంద్రాలు
- ఇట్టే అర్థమయ్యేలా మూడు మాసాలకో పాఠ్యపుస్తకం
- రూ.20 లక్షల వ్యయంతో ముస్తాబైన 34 కేంద్రాలు
- బాలబాలికలకు ఆకర్షణీయమైన దుస్తులు

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలు ఆకట్టుకునేలా ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చిన్నారుల మొదటి మెట్టు అంగన్‌వాడీ నుంచి ప్రారంభమయ్యే విద్యను బలోపేతం చేస్తూ.. మెరుగైన పౌష్టికాహారాన్ని అందించేందుకు కసరత్తు చేస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల పేరును మార్పు చేసి అన్ని కేంద్రాలకు పూర్వ ప్రాథమిక పాఠశాల నామకరణంతో కొత్త విద్యను అందుబాటులోకి తీసుకొస్తుంది. మూడేళ్ల నుంచి మొదలు ఆరేళ్ల వరకు చిన్నారులకు అందించే విద్యాబోధనపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలను అత్యంత అందంగా తీర్చిదిద్దారు. ఇక అంగన్‌వాడీ కేంద్రాలన్నీ పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చెందనున్నాయి.

అర్థమయ్యే రీతిలో బోధన

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా మూడు నెలలకు ఒకసారి మాత్రమే మార్చే పుస్తకాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఇదీ అన్ని సెంటర్లకు అందించనున్నారు. పిల్లలకు ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు చేపట్టాల్సిన పరిశుభ్రత గురించి తెలియజేస్తారు. అలాగే, పరిసరాల పరిశుభ్రత, పండగల గురించి వివరించడం, ఇంగ్లీష్ రైమ్స్ వంటి బోధన ఉండనుంది.

ముస్తాబైన 34 కేంద్రాలు..

రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం పాలసీలో అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రాలన్నింటిని పాఠశాలలుగా మార్చి పెయింటింగ్‌తో పాటు ఇత రత్రా మౌళిక సదుపాయాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా 644 కేంద్రాలు ఉండగా తొలుత 34 కేంద్రాలను ఇక్కడి అధికారులు ఎంపిక చేశారు. వీటికి రంగులు వేయడం, తదుపరి ఏబీసీడీ లు, పండ్లు, మొక్కలు గోడలపై వేసి అందంగా ముస్తాబు చేశారు. వీటి రంగులకు గాను ప్రభుత్వం రూ. 20 లక్షలు వెచ్చించింది. వీటితో పాటు 50 సెంటర్లలో త్రాగునీటిని తీర్చేందుకు చర్యలు చేపట్టా రు. అధికారికంగా శనివారం భూపాలపల్లి నియోజ కవర్గంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనా రాయణ రావు చేతుల మీదగా ప్రారంభించేదుకు ఆ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు.

కొత్త టీచర్లా.. పాత టీచర్లేనా..?

అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్పు చేస్తున్న దృష్ట్యా కొత్తగా టీచర్ల నియామకం చేస్తారా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పాఠశాలలుగా మార్చిన నేపథ్యంలో అనుభవజ్ఞులైనా, ఉన్నత విద్యావంతులైన టీచర్ల అవశ్యకత తప్పనిసరి అనివార్యమవుతోంది. అయితే దీనిపై ప్రభుత్వం ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. మరోవైపు ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న టీచర్లు, హెల్పర్లు పదో తరగతి, లేదా ఇంటర్ అర్హతతో విధుల్లో చేరినవారే ఉన్నారు. దీంతో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ చాలా మందిలో ఉత్పన్నమవుతోంది. కాగా, ప్రస్తుతం ఉన్న సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ టీచర్లకు ఈ నూతన విద్యావిధా నంపై అవగాహన సదస్సులు నిర్వహించారు.

అంతంత మాత్రంగానే పనితీరు..

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు జిల్లాలో అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయనే విమర్శలు లేకపోలేదు. అద్దె భవనాలు ఉండడం, పౌష్టికాహారం సరిగ్గా పంపిణీ కాకపోవడం, కోడిగుడ్లు పక్కదారి పట్టడం, పిల్లల హాజరు శాతం సరిగ్గా లేకపోవడం, సమయ పాలన పాటించకపోవడం వంటివి ఇన్నాళ్లు ఆయా కేంద్రాల్లో కొనసాగుతూ వచ్చాయి. జిల్లాలోని 12 మండలాల్లో భూపాలపల్లి, మహాదేవ పూర్ రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటిల్లో మొత్తంగా 644 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల ద్వారా ప్రస్తుతం 4,631 మంది గర్భిణులు, బాలింతలు, 11,417 మంది 6 నెలల నుండి 3 సంవత్సరాలున్న చిన్నారులు, 8,692 మంది 3 నుంచి చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

డ్రెస్ కోడ్ వచ్చేసింది..



అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ ప్రాథమిక పాఠశాలలుగా మార్చేందుకు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఈ పాఠశాలలకు వచ్చే చిన్నారులకు బాలబాలికలకు వేరువేరుగా దుస్తులను అందించేందుకు నిర్ణయం తీసుకోగా జిల్లాకు ఆకర్షణీయమైన దుస్తులు రెండు కలర్స్‌లలో (డ్రెస్‌కోడ్) కూడా వచ్చేసింది. బాలబాలికలకు వేరేవేరుగా స్టిచ్చింగ్ చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు 8,692 మంది ఉన్నారు. వీరికి గాను మొదటి దఫాలో భాగంగా ప్రస్తుతం 3,558 మంది చిన్నారులకు యూనిఫాం జిల్లాకు రాగా.. స్వయం సంఘాలకు కుట్టడానికి అందించారు.

ప్రభుత్వ ఆదేశానుసారంగా ఏర్పాట్లు

- చెన్నయ్య, జిల్లా సంక్షేమాధికారి

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అంగన్‌వాడీ సెంటర్లలో ఏర్పాట్లు చేశాం. కేంద్రాల్లోని చిన్నారులకు డ్రెస్‌కోడ్ కూడా వచ్చింది. చిన్నారులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా మొదటి దఫాలో ఎంపిక చేసిన కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాం. మరికొద్ది రోజుల్లోనే అన్ని కేంద్రాల్లో మార్పులు జరుగుతాయి.

మహనీయుల ఆశయాలతో ముందుకు సాగాలి

సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమంలో కలెక్టర్ దివాకర



కలెక్టర్, అధికారులతో సన్మానం పొందిన మహిళా ఉపాధ్యాయులు

ములుగు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహనీయుల స్ఫూర్తి, ఆశయాలతో ముందుకు సాగాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. శుక్రవారం ములుగులోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు జరగగా ఆయన ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అట్టడుగువర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలో భర్త జ్యోతిరావుపూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి చదువు నేర్చుకుని ఉపాధ్యాయురాలు అయ్యారని అన్నారు. విద్యను అభ్యసిస్తేనే స్త్రీ విముక్తి సాధ్యమవు తుందని గ్రహించిన సావిత్రిబాయి సాటి మహిళలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో బాలికల పాఠశాలను ప్రారంభించి మహిళా చైతన్యానికి బాటలు వేశారని అన్నారు. తద్వారా ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తిగడించారన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయినులుగా ఎంపికైన జి.నీరజ, వి.జ్యోతి, జె.మమత, టి.రాధిక, కె.భాగ్యలక్ష్మి, కె.జయశ్రీ, సీహెచ్.రాణి, ఎల్.పద్మ, వి.రమాదేవి, పర్వతాల రమాదేవి, సీహెచ్.మాధురిదేవి, ఎ.మధురిమ, కె.సునీత, జి.లక్ష్మి, పద్మావతి, రిజ్వానా కౌసర్‌బేగం, ఎం.సమ్మక్క, బి.సుమలతాదేవిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, డీసీఈబీ కార్యదర్శి ఇ.సూర్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్, సమగ్రశిక్షా కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, గుల్లపల్లి సాంబయ్య, జి.రమాదేవి, ఎంఈవోలు సామల శ్రీనివాసులు, కేశవరావు, కొయ్యడ మల్లయ్య, మేనక, వెంకటేశ్వర్లు, వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని ఉపాధ్యాయులు ఉన్నత విద్యను అందించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన మహిళా ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల చదువుకోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి సావిత్రబాయి పూలే అన్నారు. సావిత్రిబాయి పూలే మహిళల జీవితాల్లో గొప్పమార్పు తీసుకువచ్చారన్నారు. ఆమె కృషి వల్లే నేడు 50శాతానికి పైగా మహిళలు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం 1నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలను హాస్టల్స్‌గా మార్చలన్న ఆలోచన చేసిందన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థులు పెద్దసంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం చేపట్టిందన్నారు. అద్దె భవనాల్లో నిర్వహి స్తున్న హాస్టల్స్‌లకు శాశ్వత భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ తొలిమహిళ ఉపాధ్యాయురాలుగా అణగారిన వర్గాల మహిళలకు అక్షర జ్యోతి వెలిగించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. సావిత్రిబాయి ఆశయాలతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, మహిళ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకే ఇందిరమ్మ ఇళ్లు

- భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు



సీఆర్‌పల్లిలో జీపీ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

చిట్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో గుడిసెలు, ఇళ్లపై పరదాలు కప్పుకుని నివసించే నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరి చేయిస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌తండ, చైన్‌పాక, జూకల్లులో నూతన జీపీ భవణాలు, చిట్యాలలో పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. చింతకుంటరామయ్యపల్లిలో నూతన జీపీ భవనం, తిరుమలపురంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు తమకు గూడు లేదని, భూసమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు మాట్లాడుతూ కొద్ది రోజుల్లో భూభారతి చట్టం వస్తుందని దీంతో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు తీరుతాయన్నారు. నియోజకవర్గం అభివృద్ధి, అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వం నిర్మించిన గృహాలను అర్హులైన లబ్ధిదారులకు అందించని మాజీ ఎమ్మెల్యే నిరసనల పేరుతో కొత్తనాటకం మొదలుపెట్టాడని విమర్శించారు. వీలైనంత తొందరలోనే నిజమైన పేదలను గుర్తించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తానన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో మోతీలాల్, ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ, ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ హైమవతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మధు వంశీకృష్ణ, గూట్ల తిరుపతి, పులి తిరుపతిరెడ్డి, ఓరం సమ్మయ్య, దొడ్డి కిష్టయ్య, చిలుకల రాయకొంరు, గుర్రపు తిరుపతి, బుర్ర శ్రీనివాస్, లక్ష్మణ్, తక్కళ్లపల్లి రాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ రఫీ, నక్క బాస్కర్, కుమార్, శరత్, వెంకటేశ్వర్లు, సుమన్, ఉయ్యాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాండవుల గుట్టల్లో రాక్‌క్లైంబింగ్

రేగొండ, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : పాండవుల గుట్టలలో రాక్‌క్లైంబింగ్, నైట్ క్యాంపు పునఃప్రారంభిస్తామని డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాండవుల గుట్టలలో శుక్రవారం జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి ట్రెక్కింగ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాండవుల గుట్టలు పర్యాటకులను ఆకర్షించే అద్భుతమైన పర్యాటక ప్రాంతమని అన్నారు. ఇక్కడ ఉన్న రాతి చిత్రాలు పురాతనమైనవని పేర్కొన్నారు. కార్యక్రమంలో రేంజ్ అధికారి నరేష్, ఎఫ్ఎస్‌ఓ గౌతమి, ఇన్‌స్ట్రక్టర్లు శ్రీకాంత్, భాస్కర్‌లు తదితరులు ఉన్నారు.

గెస్ట్‌హౌస్‌ల కూల్చివేతకు రంగం సిద్ధం

మహదేవపూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం శివారులో శిథిలావస్థకు చేరుకున్న వసతి గృహాలను దేవాదాయ ధర్మాదయ శాఖ ఉత్తర్వుల ఆదేశాల మేరకు నూతన గెస్ట్‌హౌస్‌లను కట్టేందుకు సంబంధిత అధికారులు కూల్చివేస్తున్నందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. 1977వ సంవత్సరంలో గుల్‌కోట గెస్ట్‌హౌస్, హనుమంతరావు గెస్ట్‌హౌస్‌లు పూర్తి శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలిపోతోందోనని అధికారులు ఎండోమెంట్ డీఈ రమేష్‌బాబుతో పాటు ఇససిబ్బందితో పాటు శుక్రవారం కూల్చివేతల కొలతలు మొదలు పెట్టారు. వచ్చే మే నెలలో పుష్కరాలకోసం భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో ఉన్న శిథిలావస్థలో ఉన్న గెస్ట్ హౌస్‌లన్నింటిని కూల్చేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎండోమెట్‌లో టెక్నికల్ అధికారులు గెస్ట్‌హౌస్‌లను సందర్శించారు. కొలతలు తీశారు.

ప్రతీ విద్యార్థికి అపార్ ఐడీ నమోదు చేయాలి

ములుగు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ నూతన విద్యావిధానం 2020 సిఫారసుల మేరకు వన్ నేషన్-వన్ స్టూడెంట్ ఐడీ అనే ఉద్దేశంతో ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిష్టరీ(అపార్) 12 అంకెల గుర్తింపు సంఖ్యను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ప్రతీ విద్యార్థికి నమోదు చేయాలని సమగ్రశిక్షా సెక్టోరల్ అధికారి అర్షం రాజు తెలిపారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం 2023లో ప్రారంభించిందని, శిశు నుంచి ఉన్నత విద్య పూర్తయ్యే వరకు అదే నంబర్ ఉంటుందని, ఈ గుర్తింపు సంఖ్యను ట్రాక్ చేయడం ద్వారా విద్యార్థుల డ్రాప్‌ఔట్ రేట్ తగ్గించడం, ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి వెళ్లినా విద్యార్థి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించవచ్చని అన్నారు. భౌతికంగా సర్టిఫికెట్లు కలిగి ఉండాల్సిన అవసరం లేకుండా డిజిలాకర్ ద్వారా విద్యార్థి వివరాలు నిక్షిప్తం కావడం వల్ల భవిష్యత్ తరాల్లో ఈ అపార్ ఐడీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలు ఈవిషయాన్ని గమనించి ఈనెల 31వతేదీ వరకు అపార్ ఐడీ నమోదును పూర్తి చేయాలని సూచించారు.



ఏరియాను అభివృద్ధి పథంలోకి తీసుకెళదాం

జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కాకతీయఖని, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి భూపాలపల్లి ఏరియాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుదామని సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక జీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లిలో భౌగోళిక పరిస్థితులు అనుకూలంగా లేవని, అయినప్పటికీ అన్ని ఏరియాలకు దీటుగా బొగ్గు ఉత్పత్తిని చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అనుకున్న స్థాయిలో బొగ్గు ఉత్పత్తిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అండర్ గ్రౌండ్ గనుల్లో సాండ్ స్టోవింగ్ సమస్య ఉందని.. దానిని త్వరలోనే అధిగమిస్తామన్నారు. ఏరియాలో ప్రొడక్షన్ కెపాసిటీ ఉంది కానీ... డిస్పాచ్ కెపాసిటీ లేదన్నారు. అందుకు అనుగుణంగా ఉప్పల్ రైతుల దగ్గరి నుంచి భూమిని లీజ్‌కు తీసుకున్నామని అందులో కోల్ యార్డ్‌ను త్వరలో విస్తరింపజేసి రోజుకు రెండు రేకుల బొగ్గును 15వేల టన్నులకు తగ్గకుండా రవాణా చేస్తామన్నారు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-2,3 భూ నిర్వాసితుల సమస్యలను కలెక్టర్ రాహుల్ శర్మ, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సహకారంతో పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్మికులకు ఏమైనా సమస్యలుంటే నేరుగా తన వద్దకు వచ్చి చెప్పుకోవచ్చన్నారు. ఇకపై ప్రతీ నెల క్వార్టర్ కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు. సింగరేణి ఏరియా ఆస్పత్రిలో డాక్టర్ల కొరత ఉన్నమాట వాస్తవమేనని ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన రోగమొస్తే కష్టమే అనే కథనాన్ని ఉద్దేశించి అన్నారు. అయితే ప్రస్తుతం నలుగురు డాక్టర్లను తీసుకొచ్చామన్నారు. ఇంకా వైద్యుల కొరత ఉందన్నారు. సింగరేణిలోకి మహిళా కార్మికులు వస్తున్నారని, వారు అండర్ గ్రౌండ్‌లోకి దిగడం శుభ పరిణామమన్నారు. ఏరియలోని 18 మంది మహిళా కార్మికులకు రెస్క్యూ కోచింగ్ ఇప్పిస్తున్నామని, వారిని రెండు టీంలుగా కోల్ ఇండియా పోటీలకు పంపించేందుకు కృషిచేస్తున్నామన్నారు. అలాగే సింగరేణి ప్రభావిత ప్రాంత ప్రజల కోసం, నిరుద్యోగుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్, వివిధ ట్రేడ్స్‌లలో ఆర్‌డీఎస్‌డీ సంస్థతో కోచింగ్ ఇప్పించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. వారు ఇచ్చే సర్టిఫికెట్‌తో బ్యాంక్‌లోన్స్ తీసుకుని నిరుద్యోగులు సొంతంగా బిజినెస్ పెట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమం త్వరలోనే సీఎండీ బలరాం అనుమతితో ప్రారంభిస్తామన్నారు.

ఈ సమావేశంలో అధికారులు కవీంద్ర, జ్యోతి, వెంకట్రామిరెడ్డి, మారుతి, గుండు రాజు, గణేష్, శ్రీనివాస్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న రామ్‌చరణ్

మహాముత్తారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహాముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలుర వసతి గృహంలో ఉంటూ 10వతరగతి చదువుతున్న గుండపు రామ్‌చరణ్ (14) అనే విద్యార్థి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హాస్టల్ వార్డెన్ శంకరయ్య తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బోర్లగూడెం గ్రామానికి చెందిన విద్యార్థి రామ్‌చరణ్ 15 రోజుల క్రితం ఇంటికి వెళ్లి శుక్రవారం హాస్టల్‌కు ఉదయం 11 గంటలకు వచ్చాడు. వార్డెన్ విద్యార్థిని ప్రభుత్వ హైస్కూల్ స్కూల్‌కు వెళ్లమని చెప్పాడు. వెళ్లిన రెండు గంటల తరువాత ప్రభుత్వ ఆస్పత్రి నుంచి హాస్టల్ విద్యార్థి పురుగుల మందు తాగాడని వార్డెన్‌కు ఫోన్ వచ్చింది. వెంటనే వెళ్లి ప్రాథమిక చికిత్స అనంతరం 108లో భూపాలపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

ఈ విషయంలో ప్రథమ చికిత్స అందిన మహాముత్తారం ప్రభుత్వ వైద్యుడు సందీప్ తెలిపిన వివరాల ప్రకారం విద్యార్థి తన తండ్రి సాగర్‌తో గొడవ జరడంతో పురుగుల మందు తాగినట్లు చెప్పాడని తెలిపారు. 20 ఎంఎల్ మందు మాత్రమే విద్యార్థి తాగినట్లు తెలిపారు. ఐతే విద్యార్థి పురుగుల మందు డబ్బా ఇంటి వద్ద నుంచి తీసుకు వచ్చాడా, లేదా యామన్‌పల్లిలోని పురుగుల మందు షాపులలో కొన్నడా అనే విషయం తెలియరాలేదు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి మాత్రం నిలకడగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

చిన్నకాళేశ్వరం మోటారు టెస్టింగ్ ప్రారంభం


చిన్నకాళేశ్వరం మోటారు పనులను పరిశీలిస్తున్న అధికారులు

మహదేవపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వీరసాగర్ వద్ద చిన్న కాళేశ్వరం పనులు గత కొన్నేళ్ల నుంచి మధ్యలోని ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చిన్న కాళేశ్వరంపై మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక దృష్టి సారించి కాల్వ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పలు సమావేశాలు సైతం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సైతం రివ్యూ సమావేశాలు ఏర్పాటు చేసి చిన్న కాళేశ్వరం పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం చిన్న కాళేశ్వరం పంప్‌హౌస్‌ను సందర్శించి మొదటి మోటార్‌ను టెస్టింగ్ చేసి ప్రారంభించారు. మిగతా రెండు మోటార్లను త్వరలోనే టెస్టింగ్ చేయనున్నట్లు ప్రభుత్వ సలహాదారుడు పెంటారెడ్డి తెలిపారు. వర్షాలకు మోటార్లు మునిగిపోవడంతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో వాటిని పట్టించుకోలేదు. ఇరిగేషన్ ఈఈ యాదగిరి, ఇరిగేషన్ అధికారులు, మెగా కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అభ్యుదయ రైతులకు పురస్కారాలు

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం ఫౌండేషన్ విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వడ్లమూడిలో శనివారం ఉదయం 10గంటలకు సంక్రాంతి సంబరాల్లో భాగంగా అభ్యుదయ రైతులకు పురస్కారాలు-2025 ప్రధానోత్సవం జరుగుతుందని చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ సహకార మార్కెటింగ్ పశు సంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, విశిష్ట అతిథిగా లోక్‌సభ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయులు హాజరవుతున్నారని అన్నారు. మహబూబాబాద్ జిల్లా నుంచి ఈ కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో అవసరం

- ములుగు ఎస్పీ శబరీశ్



క్రీడల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో ఫిజికల్ ఫిట్‌నెస్ ఎంతో అవసరమని జిల్లా ఎస్పీ శబరీశ్ అన్నారు. శుక్రవారం ములుగు మండలంలోని జాకారం డీటీసీలో జరిగిన జిల్లా స్పోర్ట్స్‌మీట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయని, వ్యాయామం, క్రీడలు పోలీసుల్లో ఉత్తేజాన్ని నింపుతాయని అన్నారు. క్రీడలతో మనకు తెలియకుండానే మానసికంగా ధృఢత్వాన్ని పొందుతామని, తమవంతుగా పోలీసులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సహిస్తామన్నారు. ప్రజల సంరక్షణ పోలీసులకు ప్రథమ కర్తవ్యమని, ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమని అన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే క్రీడల్లో మొత్తం ఆరు టీంలు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, క్యారంబోర్డు, రన్నింగ్ ఈవెంట్స్‌లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, జిల్లా అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ కిషోర్‌కుమార్, సీఎస్‌బీ డీఎస్పీ సందీప్‌రెడ్డి, ములుగు డీఎస్పీ రవీందర్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ కాస్ట్-3లో ప్రమాదం

- ఓల్వో ట్రక్కును ఢీకొట్టిన మరో ట్రక్కు
- డ్రైవర్‌కు తీవ్రగాయాలు


నుజ్జునుజ్జు అయిన వోల్వో ట్రక్కు ముందుభాగం

గణపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని ఓపెన్ కాస్ట్-3లో శుక్రవారం తెల్లవారుజామున ప్రమాదం చోటుచేసుకుంది. తోటి డ్రైవర్లు, కార్మికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఓసీ-3లో వోల్వో ట్రక్‌డ్రైవర్లు ఓబీ మట్టిని తరలించేందుకు మూడు షిఫ్టులుగా విధులు నిర్వహిస్తారు ఇందులో భాగంగానే శుక్రవారం తెల్లవారుజామున 3.30 గంటలకు (షిఫ్టు ముగిసే సమయం)లో ప్రమాదం చోటుచేసుకుందని తెలిపారు. క్వారీ లోపలి నుంచి మట్టిలోడ్‌తో బయటకు వస్తున్న వాహనాన్ని గమనించిన మరో వాహన డ్రైవర్ తన వాహనాన్ని పక్కఉ నిడిపినట్లు తెలిపారు. నిలిచి ఉన్న వాహనం వెనుకనుంచి వస్తున్న మరో ట్రక్కు డ్రైవర్ అన్వర్‌పాషా ప్రమాదవశాత్తు ఆగి ఉన్న ఓల్వో ట్రక్కును ఢీ కొట్టాడన్నారు. దీంతో అన్వర్‌పాషకు తీవ్ర గాయలు కాగా అంబులెన్స్ ద్వారా ఏరియా సింగరేణి ఆస్పత్రికి తరలించామన్నారు. కాగా, అన్వర్‌పాషా గణపురం మండల కేంద్రానికి చెందిన వ్యక్తి అని, అతడు ఓసీ-లో ప్రైవేటు కాంట్రాక్టర్ వద్ద గత కొంత కాలంగా పని చేస్తున్నాడని తెలిపారు.

బాధితున్ని అన్నివిధాలా ఆదుకోవాలని తోటి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఓసీ-3లో జరిగిన ప్రమాదాన్ని ఏరియా సింగరేణి జీఎం ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన చికిత్సనందించాలని సూచించారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్

చిన్నగూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. మండలంలోని ఉగ్గంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నిలిపిన ఎంపీడీవో రామారావు కారు అద్దాలను ధ్వంసం చేసిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. శుక్రవారం ఈ విషయంపై ఎస్సై ఝాన్సీని వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, కారును బాధితుడి కుటుంబసభ్యులు రిపేర్‌చేసి ఇస్తామని తెలపడంతో ఎంపీడీవో రామారావు కేసు వాపసు తీసుకున్నట్లు సమాచారం.

ఎంపికైన లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

- లేదంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తా
- నిరసన దీక్షలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి కృష్ణకాలనీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పేదలపట్ల మొండివైఖరి విడనాడాలని, అర్హులుగా ఎంపికైన వారికి వెంటనే ఇళ్లు అప్పగించాలని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో శుక్రవారం అర్హులకు కేటాయించిన డబుల్‌బెడ్ రూం ఇళ్ల పట్టాలని వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికమే కొలమానంగా 392 మంది లబ్ధిదారులను తమ ప్రభుత్వ హయాంలో ఎంపిక చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 13 నెలలు కావస్తున్నా లబ్ధిదారులకు ఇళ్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అన్యాయంగా జైలుకు పంపుతూ ఇబ్బందులు పెడుతున్నారన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లను కాంగ్రెసోళ్లకే ఇవ్వాలను కుంటూ కొత్తగా ఓ 500 ఇళ్లు నిర్మించుకొని ఇవ్వాలని, పేదలకు మాత్రం అన్యాయం చేయొద్దని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారంటీల పేరుతో 420 హామీలను ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. అర్హులుగా ఎంపికైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుంటే.. త్వరలోనే ఆమరణ నిరాహార దీక్ష చేపడుతానని మాజీ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ, మునిసిపల్ చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, వైస్ చైర్మన్ గండ్ర హరీష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌యాదవ్, కౌన్సిలర్లు కొత్త హరిబాబు, నూనె రాజు, మంగళపల్లి తిరుపతి, మురళీధర్, రజిత, మౌనిక, నాయకులు కళ్లెపు రఘుపతి రావు, మందల విద్యాసాగర్‌రెడ్డి, సెగ్గం సిద్దు, బీబీచారి, పోలవేణి అశోక్ యాదవ్, మోతే రాజు, పోల వేణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త రుణాలు మంజూరు చేయండి

- పాలకవర్గ సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు


సమావేశంలో డీసీసీ బ్యాంకు 2025- డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పొందిన రైతులకు వెంటనే కొత్తగా పంట రుణాలు అందచేయాలని డీసీసీ బ్యాంకు అధికారులను టెస్కాబ్ చైర్మన్ మార్నేనీ రవీందర్‌రావు ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో బ్యాంకు పాలకవర్గ సమావేశం జరిగింది. అధ్యక్షత వహించిన రవీందర్‌రావు అధికారులు, సభ్యులకు దిశా, నిర్దేశం చేశారు. ఇటీవలే మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో హైదరాబాద్‌లో జరిగిన సమీక్ష అంశాలను రవీందర్‌రావు సమావేశంలో ప్రస్తావించారు. డీసీసీ బ్యాంకు ఆర్థిక ప్రగతి, రుణాలు, రికవరీలు, పంట రుణాలు, రుణమాఫీ తదితర విషయాలపై మంత్రి స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు రవీందర్‌రావు పేర్కొన్నారు. ముఖ్యంగా కొత్త రుణాల మంజూరులో జాప్యం ఉండరాదని మంత్రి నిక్కచ్చిగా చెప్పినట్లు రవీందర్‌రావు వెల్లడించారు. అదేవిధంగా రుణమాఫీ పొందిన రైతులకు కొత్త రుణాలు అందడంలో ఏమైనా సమస్యలు ఎదురైతే బ్యాంకు అధికారులు, సిబ్బంది వెను వెంటనే పరిష్కరించే బాధ్యతలు నిర్వహించాలన్నారు. బ్యాంకు ఆర్థిక ప్రగతి మరింత ఉన్నత స్థాయికి చేరేలా ప్రణాళికలు రూపొందించి కార్యాచరణలోకి తీసుకురావాలన్నారు. పలు విధాలుగా బ్యాంకు రుణాలు అందుబాటులో ఉన్నాయని, అయితే అవగాహన కొరవడడం వల్ల ప్రజలు రుణాలు పొందలేక పోతున్నారని పేర్కొన్నారు. ఉన్నత విద్య కోసం రుణాలు, బంగారం రుణాలు ఇలా కమర్షియల్ బ్యాంకుల కంటే విస్తృతంగా రుణాల కల్పన ఉన్న దశలో విస్తృత ప్రచారం జరపాలని ఆదేశించారు. అదే విధంగా డిపాజిట్లపై కూడా ఆకర్షణీయమైన వడ్డీని అందిస్తున్న క్రమంలో ప్రతీ అధికారి గ్రామ స్థాయిలోకి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. రుణాల రకవరీ విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. వందకు వంద శాతం రికవరీ జరగాలని స్పష్టం చేశారు. రుణమాఫీలో ఏమైనా సాంకేతిక సమస్యల కారణంగా ఇంకా లబ్ధిపొందని వారు ఉంటే వెంటనే సమస్యను పరిష్కరించాలని టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు అధికారులను ఆదేశించారు.

సమావేశం అనంతరం డీసీసీ బ్యాంకు 2025-డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వరంగల్ డీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఉపేందర్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన క్రమంలో ఆయనను రవీందర్‌రావు, పాలక వర్గ సభ్యులు, బ్యాంకు అధికారులు శాలువాతో సన్మానించి అభినందించారు.

ఈ సమావేశంలో సీఈవో వజీర్ సుల్తాన్, వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్లు రమేశ్, రంజిత్, హరిప్రసాద్, రాజేశ్వర్‌రెడ్డి, మురళీధర్‌రావు, గోపాల్‌రావు, యాదగిరిరెడ్డి, నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, రవిరాజు, టెస్కాబ్ డీజీయం శ్రీనివాస్ రావు, డీసీసీ బ్యాంకు డీజీఎం అశోక్, ఏజీఎం రాజు, మేనేజర్ నిహారిక తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

నెల్లికుదురు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ తెలిపారు. కాస్వతండా, బంజర, రావిరాల, బ్రాహ్మణకొత్తపెల్లి, నెల్లికుదురు బడితండా, సొళ్లతండా, లైన్ తండాలలో శుక్రవారం రూ.60 లక్షల ఉపాధి హామీ నిధులతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణంతో గ్రామాలలో వీధులు శుభ్రంగా ఉంటాయన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని, ఏకగ్రీవంగా సర్పంచ్‌లను ఎన్నుకోవడానికి కృషి చేయాలన్నారు. ఎంపీవో పద్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపెల్లి ప్రభాకర్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని సత్యపాల్‌రెడ్డి, కాసం లక్మారెడ్డి, బాలాజీనాయక్, గుట్టయ్య, జెల్ల వెంకటేష్, పెరమాండ్ల శంకర్, మల్లేశం, గొట్టిముక్కుల నరేందర్, పులి నర్సయ్య, వెంకన్న, పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల వాగ్వాదం..


నెల్లికుదురులో వాగ్వాదానికి దిగిన కార్యకర్తలు

నెల్లికుదురు మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. శుక్రవారం నెల్లికుదురు గ్రామంలో రెండు సీసీ రోడ్లకు ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శంకుస్థాపన చేసి వెళ్లిపోయారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు పులి వెంకన్న వర్గానికి సీసీరోడ్లు ఇవ్వలేదని, వెన్నం క్రాంతి వర్గీయులకు సీసీరోడ్లు ఇచ్చారని కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన క్రాంతి వర్గీయులకు సీసీరోడ్డు పనులు ఎందుకు ఇచ్చారని రెండు వర్గాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మధ్య గొడవ జరిగింది. దీంతో నెల్లికుదురులో కాంగ్రెస్ వర్గ పోరుకు తెర లేచినట్లైంది. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరి సత్తా ఏమిటో చూపించుకుందామని ఇరు వర్గీయులు హెచ్చరికలు జారీ చేసుకున్నారు.

చింతలగట్టు వట్టేవాగు సమ్మక్క-సారలమ్మ జాతర తేదీలు ఖరారు

- ఫిబ్రవరి 12 నుంచి నాలుగు రోజులు నిర్వహణ


దేవాలయంలో సమావేశమైన పూజారులు, జాతర కమిటీ నిర్వాహకులు

గూడూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలగట్టు వట్టే వాగు సమ్మక్క-సారలమ్మ జాతర తేదీలు ఖరారయ్యాయి. ఫిబ్రవరి 12 నుంచి నాలుగు రోజుల పాటు జాతర జరుగనుంది. ఈ మేరకు శుక్రవారం చింతలగట్టులో జాతర కమిటీ సభ్యులు, పూజారులు జాతర తేదీలను ప్రకటించారు. జాతరకు సంబంధించిన ఏర్పాట్లను ప్రారంభించాలని పూజారులు, జాతర కమిటీ నిర్వాహకులు సమావేశంలో నిర్ణయించుకున్నారు. కాగా, ప్రతీ రెండేళ్లకొకసారి జరిగే మహాజాతర సమయంలో వచ్చే భక్తులు ప్రస్తుతం ఏడాది పొడవునా తమకు అనుకూలమైన సమయంలో నిత్యం అమ్మవార్ల దర్శనానికి వేల సంఖ్యలో తరలివస్తున్నారు. వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. వనంలో కొలువైన వనదేవతలు జనం మధ్యకు రావడంతో అడవి అంతా జనసంద్రంగా మారుతుంది. మహాజాతర జరిగిన మరుసటి సంవత్సరం మినీ జాతర నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఫిబ్రవరి 12 బుధవారం రోజున మండ మెలిగే కార్యక్రమం, 13న గురువారం పసుపు కుంకుమ మార్చుకునుట, 14న మొక్కులు చెల్లించుట, 15న జాతర ముగింపు కార్యక్రమం ఉంటుందని పూజారుల కమిటీ అధ్యక్షులు దారం సిద్ధు, జాతర కమిటీ అధ్యక్షుడు పెనక నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఈసం సహదేవులు, పూజారుల కమిటీ ప్రధాన కార్యదర్శి కారం లక్ష్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసం భద్రయ్య, తాటి సుధాకర్, పూనెం జనార్దన్, దారం నరేష్, సిద్దబోయిన పోతయ్య, కొట్టెం వజ్జయ్య, దారం సాంబరాజు, పొడుగు వీరభద్రం, పూనెం అశోక్, ఈసం భద్రమ్మ, బిజ్జ బుచ్చమ్మ పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2570	2345
పల్లికాయ (సూక)	7300	5600
పల్లికాయ (పచ్చిది)	4700	4500
కందులు	-	-
పెసళ్లు	7500	4000
పత్తి	7020	5800
పసుపు (కాడి)	11329	10235
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14000	9000
తేజ మిర్చి (కొత్తది)	15500	12000
తేజ ఏసీ	15400	14000
వండర్‌హాట్ ఏసీ	13500	13000
యూఎస్341ఏసీ	15000	11000
యూఎస్341కొత్తది	15500	14500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలి

- మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్

తొర్రూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీకి ప్రధాన ఆదాయమైన ఆస్తి పన్ను వసూళ్లు వందశాతం చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ శాంతి కుమార్ అన్నారు. శుక్రవారం మునిసిపాలిటీ ఆవరణలో సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. మార్చి సమీపిస్తున్న నేపథ్యంలో పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. టాక్స్ కట్టని వ్యాపార సముదాయాలను సీజ్‌చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పెండింగ్ బకాయిదారులకు రెడ్ నోటీసు ఇవ్వాలని, కట్టనివారి ఆస్తులు జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని మునిసిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మేనేజర్ కట్టస్వామి, ఆర్ఐ రాజయ్య, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, మునిసిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

హ్యాట్సాఫ్ వాట్సాప్ యూత్

- గ్రామాల పేరుతో గ్రూపుగా ఏర్పడుతున్న యువత
- పేదలకు చేయూతనిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్న యువకులు

ఆదర్శం

తొర్రూరు రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం సాంకేతికత ఏ మేరకు ప్రభావం చూపుతోందో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా సోషల్ మీడియా అందరి జీవనంలో భాగమైపోయింది. ఇక వాట్సాప్ గ్రూపులకైతే కొదవేలేదు. అందరూ ఏదోఒక రకంగా వాట్సాప్ గ్రూప్‌లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు యువత సమాజసేవే లక్ష్యంగా తమతమ గ్రామాల పేర్లతో గ్రూపులు తయారుచేసి.. నిరుపేదలకు, ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అలా సహాయం పొందిన పలువురు 'హ్యాట్సాఫ్ వాట్సాప్ యూత్' అంటూ అభినందిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని 29 గ్రామాలు ఉండగా, ప్రతీ గ్రామంలో తమ ఊరి పేరుమీద వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి, ఆయా గ్రామాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని, నిరాశ్రయులైన వృద్ధులను గుర్తించి.. వారి వివరాలను వాట్సాప్ గ్రూప్‌ల్లో షేర్ చేసి.. విద్యావంతులు, సేవాతత్పరులు, ఇతర ప్రాంతాల్లో ఉండే వారి తోచినంత సాయం చేస్తున్నారు.



తొర్రూరు మండలం వెంకటాపురంలో వెంకటాపురం సేవా ట్రస్టుద్వారా 50కేజీల బియ్యం అందస్తున్న వాట్సాప్ గ్రూపు సభ్యులు (ఫైల్)

- వెంకటాపురం గ్రామంలో 'మన ఊరు-మనమందరం' అనే వాట్సాప్ గ్రూప్ ద్వారా కొండ యాకన్న అనే గ్రామస్థుడు గ్రూపులోని సభ్యులను భాగస్వామ్యం చేస్తూ వెంకటాపురం సేవా ట్రస్టు పేరుతో వృద్ధులకు, నిరుపేదలకు, విద్యార్థులకు సాయం అందిస్తున్నారు. చనిపోయిన వారి కుటుంబాలకు అండగా నిలవడం, చలితో ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు దుప్పట్లు, రగ్గులను అందజేస్తున్నారు. అలాగే తమతతమ ఇళ్లలో కనీసం శుభ, అశుభకార్యాలు చేసుకునే స్థితిలో లేని పేదలకు వంట సామగ్రిని అందిస్తున్నారు.
- వెలికట్టె గ్రామానికి చెందిన పోసాని సంతోష్, దీకొండ యాకన్న, రాము, అనిల్ అనే యువకులు వెల్లికట్టె గ్రామ సమాచారం, వెల్లికట్టె గ్రామ ప్రజలు అనే గ్రూపును క్రియేట్ చేసి.. అనారోగ్యంతో ఉన్న పేదలు, తమ వారి అంత్యక్రియలు కూడా చేయలేని స్థితిలో ఉన్న వారికి మరణించిన పేదల కుటుంబాలకు సాయం అందించడంతో పాటు.. ఏదైనా సమస్యతో మృతి చెందిన వారి కుటుంబాల్లో ఉన్న చిన్నారుల పేరిట తమకు తోచిన కొంత మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేస్తున్నారు.
- కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఎర్రం రాజు, కమ్మగాని శ్యామ్ అనే ఇద్దరు 'మా గ్రామం కంఠాయపాలెం, మా ఊరు కంఠాయపాలెం' అనే వాట్సాప్ గ్రూపులను క్రియేట్ చేశారు. తద్వారా గ్రామంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నా, ఆర్థికంగా చితికిపోతున్న వారికి ఆయా గ్రూపుల్లో ఉన్న సభ్యుల సహకారంతో సహాయం చేస్తుంటారు. ఇలా ఎన్నో గ్రామాల్లో అనేక మంది యువకులు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా సమాజసేవలో పాలుపంచుకుంటున్నారు. సాంకేతికతను వినియోగించుకుంటూ అభాగ్యులకు అండగా ఉంటున్నారు.



వెల్లికట్టెలో కొమ్ము సతీష్ భార్యకు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాన్ని అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు (ఫైల్)



ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థానం

ఐనవోలు జాతరపై సమీక్ష సమావేశమేదీ?

- పట్టుమని పదిరోజులే సమయం
- నిర్లక్ష్యం వీడకపోతే భక్తులకు తిప్పలు తప్పనట్టే!

ఐనవోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రెండో పెద్ద జాతరగా గుర్తింపు పొందిన ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలకు పట్టుమని పదిరోజుల సమయమే ఉంది. నెల రోజుల ముందే ఏర్పాటు చేయాల్సిన సమీక్ష సమావేశం.. నేటికీ నిర్వహించకపోవడంపై భక్తులకు అసౌకర్యాలు కలిగే అవకాశం ఉంది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జాతర సమయం సమీపిస్తున్నా.. నేటికీ సమీక్ష సమావేశం ఏర్పాటు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. నెల ముందే జాతర సమీక్ష సమావేశం నిర్వహించి 15 శాఖల జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేస్తేగానీ జాతర వరకు 80 శాతం పనులు పూర్తవుతాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో 15 శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే భక్తులకు సౌకర్యాలు లభిస్తాయి. లేదంటే ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. పారిశుధ్య సిబ్బంది నియమించి వ్యర్థాలను తొలగించడం, తాగునీరు, రహదారుల మరమ్మతులు, విద్యుత్ సరఫరా, ట్రాఫిక్ చెక్‌పోస్టుల ఏర్పాటు, పార్కింగ్‌లకు స్థలాల కేటాయింపు, వైద్య సేవలు, ఆర్టీసీ బస్సుల రవాణా సౌకర్యం, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, భక్తుల స్నానాలకు నల్లాల ఏర్పాటు, మహిళలు దుస్తులు మార్చుకోడానికి (డ్రెస్సింగ్ రూమ్) తడుకలతో ఏర్పాటు, భక్తుల వసతి, పోలీస్‌బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి కమాండ్ కంట్రోల్ సిస్టం ద్వారా జాతరను పర్యవేక్షిస్తారు. గత జాతరలో జరిగిన లోపాలను గుర్తించి మళ్లీ పునరావృతం కాకుండా సౌకర్యాలను మెరుగుపర్చాల్సిన అవసరం ఉంది.

ట్రస్టు బోర్డు నియామకం ఎప్పుడు?

ఐనవోలు దేవస్థానం ట్రస్టుబోర్డు నియామకం ఊసేలేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ట్రస్టుబోర్డులో ధర్మకర్తలు, చైర్మన్ పదవుల కోసం ఆ పార్టీ నాయకులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. గత జాతర సమయంలో వారం రోజుల కోసం చైర్మన్ లేకుండా ధర్మకర్తల కమిటీని నియమించి చేతులు దులుపుకున్నారు. వచ్చే జాతర వరకు ట్రస్టుబోర్డును నియమింపచేస్తామని పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. కానీ మళ్లీ జాతర రానేవచ్చింది. ఇప్పటి వరకు ట్రస్టు బోర్డు నియామకమే జరుగలేదని ఆశావహులు మదనపడుతున్నారు. ఈ సారి పునరుద్ధరణ కమిటీతోనే సరిపెట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తాం

- అద్దంకి నాగేశ్వర్‌రావు, ఈవో

జాతర సమీక్ష సమావేశం తేదీని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఖరారు చేస్తానని చెప్పారు. ఎండోమెంట్ శాఖ నుంచి జాతర టెండర్లు పూర్తిచేసుకున్నాం. చలువ పందిర్లు, క్యూలైన్ల నిర్మాణ పనులు, విద్యుత్తు లైట్ల ఏర్పాట్లు చేపట్టాం. పార్కింగ్ స్థలాల చదును, చెక్‌పోస్టుల ఏర్పాట్లలో పోలీస్‌శాఖ నిమగ్నమైంది.

ఆధ్యాత్మికం

12 నుంచి మల్లికార్జునుడి మహాజాతర

- సంక్రాంతి నుంచి ఉగాది వరకు ఉత్సవాలు
- లక్షలాదిగా తరలిరానున్న భక్తులు

ఐనవోలు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ఉత్సవాలు సమీపించాయి. లక్షలాది మంది భక్తులు భక్తి భావంతో ముద్దుగా పిలుచుకునే మల్లన్న జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. జనవరి మకర సంక్రమణంతో ప్రారంభమయ్యే జాతర ఉత్సవాలు ఉగాది వరకు కొనసాగుతాయి. స్వామి వారికి దృష్టికుంభం డిసెంబరు 16 సోమవారం (ధను సంక్రమణ) నిర్వహించారు. ఈ నెల 12న ఆదివారం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజరోహణం, నూతన వస్త్రాలంకరణం చేయనున్నారు. 13న సోమవారం భోగి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి దర్శించుకుంటారు. 14న మంగళవారం మకర సంక్రాంతిని పురస్కరించుకుని రాత్రి దేవుడి రథం(బండ్లు) ఆలయం చుట్టూ తిరుగుతాయి. ఆయా జిల్లాల నుంచి వచ్చే భక్తుల తోపాటు ఉమ్మడి జిల్లాకు చెందిన భక్తులు తరలి వస్తారు. 15న బుధవారం కనుమ స్వామి వారి దర్శనం. 16న గురువారం మహాసంప్రోక్షణ క్రతువు సమారాధన పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఫిబ్రవరి 3 సోమవారం వసంత పంచమి శ్రీభ్రమరాంభిక అమ్మవారి దశమ వార్షికోత్సవం, 12న బుధవారం రేణుకాదేవి(ఎల్లమ్మదేవత) పండగ నిర్వహిస్తారు.

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవములు

శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు పాంచాహ్నిక దీక్షతో త్రికుండాత్మకంగా భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కల్యాణ బ్రహ్మోత్సవములు శైవాగమోక్తంగా వైభవంగా నిర్వహించనున్నారు. 24న సోమవారంసూర్యచంద్ర ప్రభవాహనసేవలు, 25న మంగళవారం అశ్వవాహనసేవ, శేషవాహనసేవ, 26న బుధవారం మహాశివరాత్రి శివకల్యాణం, పెద్దపట్నం, సింహవాహనసేవ, రాత్రి 7 గంటలకు శ్రీ భ్రమరాంబమల్లికార్జునస్వామి వారి కల్యాణం అనంతరం నంది వాహనసేవ నిర్వహి స్తారు. 27న గురువారం రావణ వాహనసేవ, రథోత్సవం, పురవీధి సేవ, 28న శుక్రవారం పర్వతవాహనసేవ నిర్వహిస్తారు. వంసతోత్సవము, పండితసన్మానాలు జరుగును. మార్చి 23 న ఆదివారం పెద్దపట్నం కల్యాణం, 30న ఆదివారం మంగళవారం ఉగాది పండుగ పంచాంగ శ్రవణం నిర్వహించనున్నారు.

వారంతపు జాతర జరుగుతుందిలా..

జనవరి 19 నుంచి మార్చి 30 వరకు వారంతపు జాతరలు ప్రతీ ఆది, బుధ వారల్లో నిర్వహిస్తారు. ఈ యేడు మొత్తం 11 ఆదివారాలు, 10 బుధవారాల్లో వారాంతపు జాతర జరుగనుంది. జాతర వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకుంటారుని ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్ తెలిపారు.



ఐనవోలు మల్లికార్జునస్వామి

వలస జీవులు..



వరి నాట్లు వేస్తున్న పురుషులు, మహిళలు

కోల్‌కతా టు కాటారం!

- ఉపాధి కోసం వస్తున్న కూలీలు
- ఉదయం నుంచే పొలం పనుల్లోకి..

కాటారం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఉపాధి కోసం వందలాది మైళ్ల కుటుంబాలతో సహా తరలివచ్చారు. ఉన్న ఊరు వదిలి.. వందలాది మంది పశ్చిమబెంగాల్ రాష్ట్ర కూలీలు భూపాలపల్లి జిల్లా కాటారానికి వచ్చారు. కోల్‌కతాకు 16కిలోమీటర్ల దూరంలో ఉన్న పలు గ్రామాలకు చెందిన వారు రైళ్లలో సుమారు 1200 కిలోమీటర్లు ప్రయాణించి.. కాటారం చేరుకున్నారు. వారంతా కొందరు స్థానికుల సాయంతో వరినాటు పనులకు వెళుతున్నారు. 20 నుంచి 22మందితో బృందాలుగా ఏర్పడి వరినాట్లు వేస్తున్నారు. మహిళలు నాట్లు వేస్తుండగా.. పురుషులు నారు మోయడం, మడుల్లో పంచడం, ఇతరత్రా పనులు చేస్తున్నారు. అయితే వీరి రాకతో రైతులకు కొంత ఊరట లభించినట్లయ్యింది. స్థానికంగా గ్రామాల్లో ఉండే కూలీలు ఉదయం 9-10గంటల మధ్య నాట్లు వేయడానికి ఇళ్ల నుంచి బయలుదేరుతుంటారు. కానీ పశ్చిమబెంగాల్ కూలీలు మాత్రం ఉదయం 7గంటలకే పొలాలకు చేరుకుంటున్నారు. తాము పనికి వచ్చిన చోటనే కలిసికట్టుగా వంట చేసుకుంటూ భోజనం చేయడం లాంటివి చేస్తున్నారు. ఇక కూలీల బృందాలకు పనులు చూపిస్తున్న మధ్యవర్తులు వంటసామగ్రి, నిత్యవసరాలు అందిస్తున్నారు. వారే రైతులనుంచి ఎకరానికి ఇంత వసూలు చేస్తూ నెలవారీగా కూలీలకు డబ ఉబ్బులు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో కొంత కమీషన్ తీసుకుంటున్నారు. ఏదేమైనా ఇతర ప్రాంతాల కూలీల రాకతో స్థానికంగా కూలీల కొరత, ఇతర ఇబ్బందుల నుంచి రైతులు కొంత ఉపశమనం పొందుతున్నారు.



ఉదయాన్నే వంటలతో సహా పొలం వద్ద కూలీలు

చైనా వైరస్‌పై సర్వత్రా చర్చ

అప్రమత్తత అవసరమంటున్న వైద్యులు, అధికారులు

వరంగల్ మెడికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చైనాలో హెచ్‌ఎంపీవీ అనే కొత్త వైరస్ విస్తరిస్తోందన్న వార్తలు సర్వత్రా చర్చనీయాంశమయ్యాయి. కొవిడ్ తరహాలోనే ఈ వైరస్ లక్షణాలు కూడా ఉంటాయన్న సమాచారంతో అందరూ నాలుగేళ్ల క్రితం నాటి కొవిడ్ అత్యవసర పరిస్థితులను గుర్తుచేసుకుంటున్నారు. కొవిడ్ తరహాలోనే కొత్తవైరస్ కూడా చైనా నుంచే విజృంభిస్తోందని తెలియడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే దీనిపై స్పందించిన ఇండియన్ హెల్త్ ఏజెన్సీ ప్రజలకు పలు సూచనలు చేసింది. ప్రస్తుతం మన దేశంలో ఈ కొత్తవైరస్ జాడ లేదని, అయినప్పటికీ కొవిడ్ నాటి పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొంది. దీనిపై హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్యతో పాటు పలువురు వైద్య నిపుణులు మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందుజాగ్రత్తగా మాస్కులు ధరించాలని, సమూహాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొవిడ్ సమయంలో తీసుకున్న జాగ్రత్తలనే పాటిస్తే వైరస్ బారి నుంచి తప్పించుకోచ్చని చెబుతున్నారు.

పోలీస్ అంటేే ఉద్యోగం కాదు కర్తవ్యం

- ఏసీబీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ తరుణ్ జోషి
- శిక్షణ పూర్తిచేసుకున్న 453 మంది కానిస్టేబుళ్లు
- అట్టహాసంగా దీక్షంత్ పాసింగ్ పరేడ్



పరేడ్ నిర్వహిస్తున్న కానిస్టేబుల్స్, గౌరవవందనం స్వీకరిస్తున్న తరుణ్‌జోషి

మామునూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అంటే కేవలం ఉద్యోగం కాదని.. అది ఒక కర్తవ్యం అని, ప్రతీ సంఘటనను పోలీసులు ఒక చాలెంజ్‌గా తీసుకోవాలని తెలంగాణ ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి సూచించారు. శుక్రవారం మామునూరు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన దీక్షంత్ పాసింగ్ ఔట్ పరేడ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణ పూర్తి చేసుకున్న పోలీసులకు, ఉన్నతాధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా 9 నెలల కఠోర శిక్షణలో కానిస్టేబుళ్లు నేర్చుకున్న కొన్ని ప్రధాన అంశాలను ప్రదర్శించారు. బైక్ స్టంట్స్, ఆత్మరక్షణ ఫైట్స్, కత్తిసాము, కర్రసాము చేసి అధికారులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా తరుణ్ జోషి మాట్లాడుతూ.. సమస్యల తో పోలీసులను ఆశ్రయించే వారికి న్యాయం చేయాలని సూచించారు. ఇటీవల సమాజంలో సైబర్ నేరాలు, హింస, ఆర్థిక నేరాలు బాగా పెరిగాయని అన్నారు. అన్ని సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని పనిచేయాలని సూచించారు. ట్రైనింగ్‌లో ఉన్న ఫిట్‌నెస్‌ను ఎప్పటికీ కాపాడుకోవాలన్నారు. ట్రైనింగ్‌తో పాటు పరేడ్‌లో ప్రతిభ కనబరిచిన వారికి ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులను అందించి అభినందించారు. అనంతరం 453 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు ఈ పరేడ్‌తో వీడ్కోలు పలికారు. వారిని కలుసుకునేందుకు ఉమ్మడి పది జిల్లాల నుంచి తల్లిదండ్రులు, బంధుమిత్రులు తరలివచ్చారు. పరేడ్‌లో వారి విన్యాసాలు చూస్తూ ఆనందంలో మునిగిపోయారు. ఆత్మీయ అలింగనం చేసుకొని తన్మయత్వం చెందారు.



మాట్లాడుతున్న ఏసీబీ డైరెక్టర్ డా, తరుణ్ జోషి (ఐపీఎస్)



పాసింగ్ పరేడ్‌లో జాతీయజెండాతో ప్రదర్శన



పాసింగ్ పరేడ్‌కు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది, శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు

ఒక్కొక్కరిని ఒక్కో ఆయుధంలా తయారు చేశాం..

- రామ్‌ప్రకాశ్, కమాండెంట్



ప్రతీ ఒక్కరిని ఒక వెపన్ (ఆయుధం)లా తయారు చేశాం. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే మానసిక ధైర్యాన్ని అందించాం. శారీరక దృఢత్వం కోసం పరేడ్ డ్రిల్ నిర్వహించాం. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, మెడిటేషన్ వంటివి నేర్పించాం. శిక్షణలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఉన్నందున పేదలకు సత్వర న్యాయం అందిస్తారని ఆశిస్తున్నాం.

మా అన్నయ్య కల నెరవేర్చా..

- ఎల్ నాగేందర్, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి



మా అన్నయ్య చిన్నప్పటి నుంచి పోలీస్ అవ్వాలని చాలా ప్రత్నించారు. కాని ఫిజికల్ టెస్టులలో ఫెయిలై ఉద్యోగం సాధించలేకపోయాడు. కాని, పోలీస్ ఉద్యోగంపై మక్కువతో నాకు అనేక సూచనలు చేసి పోలీస్ ఉద్యోగం సాధించేలా సహాయపడ్డాడు. భవిష్యత్తులో మరిన్ని ప్రమోషన్‌లు తెచ్చుకుని మంచి స్థాయికి చేరుకుంటా. సమాజానికి సేవ చేస్తా.

నాన్న స్ఫూర్తితో ..

- ఎ.విజయ్ టీజీఎస్పీ కానిస్టేబుల్ సిద్దిపేట్



నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ వృత్తి అంటే చాలా ఇష్టం. మానాన్న కూడా పోలీస్ ఆఫీసర్ అవ్వాలని చాలా సార్లు ప్రయత్నించారు. కానీ ఉపాధ్యాయ వృత్తిలోనే ఉండి పోయారు. అందువల్ల నన్ను ప్రోత్సహించారు. పోలీస్ ఉద్యోగం సాధించి సమాజానికి సేవ చేయాలని చేప్పేవారు. ఆ ప్రోత్సాహంతోనే నేను ఈ రోజు మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. చాలా ఆనందంగా ఉంది.

అన్యాయాన్ని అరికట్టడమే లక్ష్యం

- నగేష్ యాదవ్, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి




మాది వ్యవసాయ కుటుంబం. గొర్రెల కాపరిగా పనిచేస్తూ రెండోసారి ప్రయత్నించి ఉద్యోగం సంపాదించాను. ఆర్థికంగా చిన్నప్పటి నుంచి అనేక కష్టాలు పడ్డాను. నా కష్టాలే గురువులా నన్ను ముందుకు నడిపించాయి. పేదవారికి న్యాయం చేస్తూ డ్రగ్స్, హత్యాచారాలను అరికట్టేందుకు కృషి చేస్తా. భవిష్యత్తులో ఇన్‌స్పెక్టర్ అవ్వాలన్నది నా కల.

సమాజ సేవే లక్ష్యం..

- పాండు, టీజీఎస్పీ కానిస్టేబుల్ సంగారెడ్డి



సమాజంలో జరిగే అఘాయిత్యాలు, అత్యాచారాలను టీవీలలో చూస్తూ విసిగిపోయా. వాటిని అరికట్టాలంటే పోలీసు ఉద్యోగమే కరెక్టని యూనిఫాం మీద మక్కువతో ఈ ఉద్యోగం సాధించాను. అల్లరిమూకల ఆగడాలను అరికట్టడంతో పాటు వీలైనంతవరకు సంఘసేవ చేస్తా.



సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి

భూపాలపల్లిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భారత దేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఘనంగా జరిపారు. భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ వేడుకలు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొత్కు ప్రవీణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : మండలంలోని మార్కెట్ యార్డు సముదాయంలో ఉన్న పూలే విగ్రహం దగ్గర, మహదేవపూర్ మండల కేంద్రంలో పూలేకు నివాళులర్పించారు. ఆలిండియా అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. నాయకుడు మెరుగు లక్ష్మణ్ మహిళా కార్యదర్శి కల్పనను శాలువాతో సన్మానించారు.

● చిట్యాల : మండల వ్యాప్తంగా సావిత్రిబాయి పూలేకు నివాళులర్పించారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ యువజన సంఘం, ఆయా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు.

● కాటారం :మండలంలో బీఎస్పీ, ప్రజా సంఘాలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. మండలకేంద్రంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డు రాజబాబు, యూపైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు అక్కల బాపు, తుడుం దెబ్బ జిల్లా సభ్యుడు దయ్యం పోచయ్య ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పూలే సేవలను కొనియాడారు.

● మల్హర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్లలో ఎమ్మార్పీఎస్, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, పెద్దతూండ్లలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మెన్ ఇప్ప మొండయ్య, మాజీ ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్, ప్రిన్సిపాల్ విజయదేవి పాల్గొన్నారు.

● ములుగు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం ఆధ్వర్యంలో కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.బాలయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు. సమగ్రశిక్షా ఉద్యోగులు ఉద్యోగులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి నిరసన వ్యక్తంచే శారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమిడి కరుణాకర్, పాడియా కుమార్ పాల్గొన్నారు.

● గోవిందరావుపేట: చల్వాయి ఎంపీపీఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు హట్కర్ సమ్మయ్య ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. పస్రాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు.

●ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ధర్మ స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలోను జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ నాయకులు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, ధర్మ స్టూడెంట్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

●కన్నాయిగూడెం: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాడు దయాసాగర్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కాంప్లెక్స్ పరిధిలో పని చేస్తున్న ఉపాధ్యాయురాళ్లను శాలవాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో పొడెం కృష్ణ ప్రసాద్, సునిత తదితరులు పాల్గొన్నారు.

●మంగపేట: మంగపేటలో పలు ఉపాధ్యాయ సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు, మహిళా సంఘాల నాయకులను శాలువాలతో సత్కరించా రు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ కరస్పాండెంట్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

●మొగుళ్లపల్లి, మండలంలోని కొరికిశాల ఆదర్శ పాఠశాలలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈసందర్భంగా మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘుపతి, ఉపాధ్యాయులు రామ కోటేశ్వర్, అమరేష్, శ్రీకాంత్, వినయ్, శ్యాంకు మార్, ప్రణీత, రాజ్‌కుమార్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ రూరల్ : సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలు ప్రభుత్వ పాఠశాల్లో సావి త్రి బాయి పూలే చేసిన సేవలపై అవగాహన కల్పించారు.



భూపాలపల్లిలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి మాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

● టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో, అంగన్‌వాడి కేంద్రాలలో పూలే జయంతి నిర్వహించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

●వెంకటాపూర్: మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబూరావు, ఉపాధ్యాయులు రవీందర్, అంబేద్కర్, మహేష్, కిషోర్ పాల్గొన్నారు.



ఏటూరునాగారం జడ్పీహెచ్ఎస్‌లో నివాళి

క్యాంటీన్లలో ఫుడ్ మెనూ పాటించాలి

కాకతీయఖని, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సింగరేణి క్యాంటీన్లలో కార్మికులకు మెనూ ప్రకారం టీ, టిఫిన్స్ ఏర్పాటు చేయాలని భూపాలపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం కవీంద్ర అన్నారు. శుక్రవారం కేటీకే-6వ గని క్యాంటీన్‌ను ఏరియా అధికార ప్రతినిధి కావూరి మారుతితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్మికులతో కలిసి టిఫిన్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికులకు పెడుతున్న టిఫిన్స్ క్వాలిటీ, క్వాంటిటీ సరిగ్గా ఉందా లేదా అని పరిశీలించామన్నారు.

తాడిచర్లలో కుక్కల స్వైరవిహారం

మల్హర్, జనవరి 3 : మండల కేంద్రమైన తాడిచర్లలో కుక్కల స్వైరవిహారంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం గ్రామంలో గొల్లపల్లిలో ఇంట్లో ఆడుకుంటున్న మూడేళ్ల బాలున్ని కుక్క గాయపరిచింది. గమనించిన కుటుంబ సభ్యులు బాలుడిని గ్రామంలోని ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స తీసుకొని జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రికి తీసుకువెళ్లారు. పదుల సంఖ్యలో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరుగుతుయి కూడా బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. కుక్కలను అరికట్టాలని కోరుతున్నారు. కుక్కల బెడద నుంచి గ్రామస్థులను కాపాడాలని వేడుకుంటున్నారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



గోదాదేవి పూజల్లో పాల్గొన్న మహిళలు

మంగపేట: జనవరి, 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మండలంలోని కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం, చెరుపల్లి, మల్లూరు, తిమ్మంపేట, పాలాయిగూడెం, రమణక్కపేట, దేవనగరం, అకినేపల్లి-మల్లారం తదితర గ్రామాల్లోని శ్రీ సీతారామాంజ నేయాస్వా మి దేవాలయాల్లో శుక్రవారం మార్గశిర మాషాన్ని పురష్కరించుకొని రోజువారి పూజ ఇత్యాధి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భం గా అమ్మవారికి దూప, దీప నైవేద్యాలను సమరించి మొక్కు లు చెల్లించుకున్నారు. అదేవిధంగా గోదాదేవికి పలు రకాల నైవేద్యాల ను సమర్పించి భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ వేడుకల లో ఆయా గ్రామాల ప్రముఖులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

డీఎఫ్‌వోను కలిసిన బంజార ఐక్యవేదిక నాయకులు

ములుగు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ములుగులోని అటవీశాఖ కార్యాలయంలో బంజార ఐక్యవేదిక నాయకులు డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా వారు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. ఈనెల 5న నిర్వహించే క్యాలెండర్ ఆవిష్కరణకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈకార్యక్రమంలో బంజార ఐక్యవేదిక నాయకులు పాల్తియా సారయ్య, పోరిక సునీల్, అంగోత్ వినాయక్, లావుడ్యా రమేష్, పోరిక రాహుల్, బాదావత్ బాలాజీ, పోరిక రాజ్‌కుమార్, తేజావత్ శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏటూరునాగారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. 2024- డిసెంబర్ 31 నుంచి 2025 జనవరి 2 వరకు మూడు రోజుల పాటు హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన చామర్తి ఐశ్వర్య సిల్వర్ మెడల్, బాధవత్ దినేష్ సిల్వర్ మెడర్, కందకూరి శ్రీహరిణి బ్రాంజ్ మెడల్‌తో పాటు గూడూరి హర్షవర్ధన్ బ్రాంజ్ మెడల్‌ను సాధించినట్లు ఏటూరునాగారం కరాటే అకాడమీ కోచ్ ఎమ్డీ. అబ్బు, ఎమ్డీ. హుస్సేన్‌లు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చూపించి పతకాలు సాధించిన విద్యార్థులను ములుగు జిల్లా యువజన, క్రీడాల అధికారి తులా రవి ప్రత్యేకంగా అభినందించారు.

భీం విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

కన్నాయిగూడెం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఫిబ్రవరి 3న కొమురం భీం విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు పొడెం బాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో తుడుందెబ్బ మండల అధ్యక్షుడు గుండ్ల పాపారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బాబుతో పాటుగా ఏఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఉద్యోగుల సంఘం జాతీయ కన్వీనర్ పొడెం కృష్ణ ప్రసాద్, కోరగట్ల రవీందర్ పాల్గొన్నారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలి



శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవోలు, అధికారులు, ఆర్‌పీలు

కాటారం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, సుపరిపాలనపై ప్రత్యేక చర్యలతో సుస్థిర అభివృద్ధికి కృషి చేయాలని నీతి ఆయోగ్, పిరమిల్ ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ ప్రధాన్, భాగ్యమాన్ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి సామర్థ్యం పెంపుదల కార్యక్రమంలో భాగంగా ఎల్ఎస్‌డీజీ(లోకలైజ్డ్ సస్టైనేబుల్ డెవలప్‌మెంట్ గోల్స్)థీమ్స్‌పై కాటారం, మహాముత్తారం మండలాల పరిధిలోని పలు శాఖల అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు బాబు, శ్రీనివాస్, వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఏవోలు పూర్ణిమ, అనూష, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్, వెటర్నరీ డాక్టర్లు ధీరజ్, భరత్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ తిరుపతిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్వైజర్లు శివారాణి, వీణ, నాగరాణి, రమాదేవి, ఏపీవో కుమారస్వామి ఉన్నారు.

డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

మొగుళ్లపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లస్వామిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల భద్రయ్యలు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు జిల్లాకేంద్రంలో జేసీడీఎస్‌వోను మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ మామిడి రమేష్, ఉపాధ్యక్షులు సుదమల్ల బాలకిషన్, కొత్తపల్లి పద్మ, కోశాధికారి గడ్డం రాజేందర్, జిల్లా సహాయ కార్యదర్శులు రేకుల రమేష్, గంగరవేణి రవీందర్, ముఖ్య సలహాదారులు పాల్గొన్నారు.

పీఎస్ఆర్ గార్డెన్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్

గోవిందరావుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయిలో గల పీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఈనెల 7న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్న నేపథ్యంలో ములుగు అదనపు కలెక్టర్ ఎం.సంపత్‌రావు హైదరాబాద్ నుంచి వచ్చిన ఈజీఎం అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో 50కంపెనీలు పాల్గొని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధరంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని అన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం సతీష్, ఎంపీవో శరత్‌కుమార్, పంచాయతీ సెక్రటరీ భారతి, ఏటీఎం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

మండలస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీలు

మంగపేట: జనవరి: 3 (ఆంధ్రజ్యోతి): మంగపేట హైస్కూల్‌లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలస్థాయి ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 8, 9 తరగతుల విద్యార్థులకు వకృత్వం. రాత పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీలను 1వ, విభాగం జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ విద్యార్థులు, 2వ, విభాగం ఏహెచ్ఎస్, కేజీబీవీ గురుకుల విద్యార్థులకు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ, కన్సలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా జైపాల్‌సింగ్‌ముండా జయంతి

వెంకటాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో శుక్రవారం జైపాల్‌సింగ్‌ముండా జయంతిని ఆదివాసీ ఐక్యవేదిక నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పూనెం రాంచందర్, పర్శిక సతీష్, చింత సోమరాజు, తాటి లక్ష్మణ్, చందు, నాగరాజు, నవీన్, పవన్‌కుమార్, రాంబాబు, సరస్వతి, మంజుల, శైలజ, శిరీష, సందీప్, నాగేశ్వర్‌రావు, అర్జున్‌పాల్గొన్నారు.

● మంగపేట: ఆదివాసీల పోరాట యోధుడు జైపాల్‌సింగ్ ముండాను ప్రతీ ఆదివాసీ ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల హక్కులు, చట్టాలను కాపాడుటకు ఉద్యమించాలని ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసీ నాయకుడు నల్లెబోయిన లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో జైపాల్‌సింగ్ ముండా జయంతి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రజా సంఘాల ఉమ్మడి వరంగల్ జిల్లాల మాజీ చైర్మన్, మంగపేట మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ ఎస్టీ సెల్ ములుగు జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, రాష్ట్ర నాయకులు గొప్ప వీరయ్య, మద్దెల అంజయ్య, జబ్బ రవిలు తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఇళ్ల సర్వేలో డబ్బులు తీసుకున్న అధికారి సస్పెన్షన్

మహాముత్తారం, జనవరి3(ఆంధ్రజ్యోతి): మహాముత్తారం మండలం మహాముత్తారం గ్రామపంచాయతీ పరిధిలోని దౌతుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో బాగంగా 10 మంది మహిళల నుంచి డబ్బులు తీసుకొన్న ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్‌ను శుక్రవారం సస్పెండ్ చేశారు. మహాముత్తారం ఎంపీడీవో శ్రీనివాసరావు ఈ విషయంలో ఇచ్చిన నివేదికను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం దౌతుపల్లి గ్రామానికి వెళ్లి విచారణ జరపాల్సిందిగా మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లును ఆదేశించారు.

పెంచిన కూలీ రేట్లను అమలు చేయాలి



సమ్మె శిబిరంలో మాట్లాడుతున్న రవీందర్

కొనసాగిన హమాలీ కార్మికుల సమ్మె

ములుగు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు ములుగులోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈసమ్మెలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్, హమాలీ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్‌లు మాట్లాడారు. సమ్మెలో హమాలీ కార్మికులు మెలుగూరి రాంబాబు, రొంటాల రమేష్, ఇనుముల భిక్షపతి పాల్గొన్నారు.

● చిట్యాల : న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేవరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని ఎఫ్‌సీఐ గిడ్డంగి హమాలీ కార్మికుల సంఘం అధ్యక్షుడు సరిగొమ్ముల సురేష్ తెలిపారు. సివిల్ సప్లై హమాలీలు మండల కేంద్రంలో చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాలుగవరోజు కొనసాగింది. సమ్మె లో హమాలీ కార్మికులు ఆరెపెల్లి సమ్మ య్య, ఎల్లయ్య, దాసారపు సాంబయ్య, కట్కూరి కుమార్, మొలుగూరి ఐలయ్య, ఆరెపెల్లి శ్రీని వాస్, శీలపాక నాగరాజు, ముత్యాల మధు, నర్సయ్య, రాజేందర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం: పెంచిన సివిల్ సప్లయ్ హమాలీ కూలీల రేట్ల జీవోను ప్రభుత్వ వెంటనే అమలు చేయాలని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సమన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని గోదాం వద్ద సివిల్ సప్లయ్ హమాలీలు చేపడుతున్న నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరింది. ఈ సమ్మెకు రేషన్ డీలర్ల మండల నాయకులు మద్దతు తెలిపారు. వెల్లండి కొమరయ్య, దానం భిక్షపతి, రమేష్, మాటేటి కుమార్ పాల్గొన్నారు.

● వెంకటాపురం: పెంచిన సివిల్ సప్లయ్ హమాలీ రేట్ల జీవోను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నం రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హమాలీకార్మికులు మండలకేంద్రంలోని జీసీసీ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిబిరంలో సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు, నాయకులు పోడెం రమేష్, పడాల రామకృష్ణ, గిరిబాబు, గోపాల్, శ్రీను పాల్గొన్నారు.



చిట్యాలలో నిరసన తెలుపుతున్న కార్మికులు

టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

మేడారం జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సుతారి పాపారావు అల్లె భాస్కర్ ఆధ్వర్యంలో ఆ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని శుక్రవారం ఎంఈవో కార్యాలయ ఆవరణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షులు గుమ్మడి ప్రభాకర్, నాయకులు గట్టి సురేందర్, కల్తీ వెంకట్, రేగ నరేందర్, తోలెం లక్ష్మయ్య, శంకర్, కృష్ణయ్య, చంద్రారెడ్డి, బుర్ర రజిత, వనిత తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయి మండల కేంద్రంలో యూటీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న సంఘ బాధ్యులు

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్, జనవరి 2(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మ అధ్యక్షతన నూతన సహకార సంఘాల ఏర్పాటు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు సహకార సంఘాల అందాలనే ప్రభుత్వ మార్గదర్శకాల పారామీటర్ల మేరకు సలహాలు, సూచనలు స్వీకరించి రాష్ట్ర ప్రభుత్వంకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. వ్యవసా యాభివృద్ధి మరియు ఉత్పత్తి పెంచేదిశగా పటిష్టమైన ప్రణాళికను అమలు పర్చడం లక్ష్యంగా నూతన సంఘాలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. డీసీవో వాల్యానాయక్,డీఏఓ విజయ్‌భాస్కర్, ఎల్‌డిఎం తిరుపతి పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

గోవిందరావుపేట, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయిలోని సోమలగడ్డ క్రాస్‌రోడ్డులో గల పీఎస్ఆర్ గార్డెన్స్‌లో ఈ నెల 7న జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో జవహర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదోతరగతి నుంచి పీజీ వరకు ఉత్తీర్ణులైన వారికి 50 ప్రైవేట్ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని అన్నారు. 15వేల ఉద్యోగాలను ప్రైవేట్ సంస్థల ద్వారా భర్తీ చేసి రాష్ట్రంలోని వివిధ పట్టణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రైవేట్ కంపెనీలలో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకుల ద్వారా ఖాళీలను భర్తీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గౌడసంఘం జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం

ములుగు కలెక్టరేట్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లంపల్లిలో గౌడసంఘం జిల్లా అధ్యక్షుడు తోటకూరి శ్రీకాంత్‌గౌడ్‌ను శుక్రవారం మల్లంపల్లి మండల సాధన సమితి నాయకులు సత్కరించారు. ఈసందర్భంగా సాధన సమితి నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి యువత ముందుకురావాలని తెలిపారు. మానవ హక్కుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనపాకల దిలీప్, మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు, ప్రధాన కార్యదర్శి ఎడ్ల అనిల్‌రెడ్డి, కానుగంటి సతీష్, బక్కి నాగరాజు, కుక్కల సంపత్, మేరుగు తదితరులు పాల్గొన్నారు.

రాళ్లవాగు వంతెనను సందర్శించిన అధికారులు

వెంకటాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాకన్నగూడెం సమీపంలో గురువారం రాత్రి కుంగిపోయిన రాళ్లవాగు వంతెనను ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ వెంకటేశ్వర్‌రావు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన వంతెన కిందికి దిగి ఎంతమేరకు కుంగిపోయిందనే విషయాలను పరిశీలించారు. ఈ వంతెన నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి సగభాగం దెబ్బతిన్నదని, మరమ్మతు ప నులను రెండు మూడురోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. బ్రిడ్జి మరమ్మతు కోసం నివేదిక తయారు చేసి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

వెంకటాపురం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి ఎదిర పంచాయతీ వరకు నిలిచిపోయిన రోడ్డు నిర్మా ణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ ఐక్య సంఘాల నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఆదివాసీ సంఘాల నాయకులు ఉయిక శంకర్, పూనెం సాయి, కొర్సా నర్సింహమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నాగుపాము కలకలం

కాటారం, జనవరి 3(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని కాటారం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఓ పెద్ద నాగుపాము హల్‌చల్ చేసింది. విద్యార్థులు ఉదయం పాఠశాలకు చేరుకుని 11గంటలకు తరగతి గది నుంచి బ్రేక్ టైంలో బయటికి వెళ్లి వచ్చారు. అప్పుడే బెంచీల కింద నుంచి శబ్దం రావడంతో విద్యార్థులు కిందకు వంగి చూడగా కొద్ది దూరంలోనే పడగవిప్పిన నాగుపాము కనిపించగా భయాందోళనతో కేకలు వేస్తూ ఉపాధ్యాయుడు నర్సయ్యకు చెప్పారు. దీంతో ఉపాధ్యాయుడు విద్యార్థులను బయటికి పంపించి హెచ్ఎం రమేష్‌కు తెలిపారు. దీంతో హెచ్ఎం స్నేక్ క్యాచర్ కోటయ్యను రప్పించగా అతడు భారీ నాగుపామును పట్టుకుని వెళ్లాడు.

విద్యార్థుల స్టీల్ ప్లేట్ల పంపిణీ

మహదేవపూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : హుజూరాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు వారు మహదేవపూర్ మండలం కాళేశవరం కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రూ.20వేల విలువ చేసే స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ హెచ్ఎం రాజేందర్ చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు.

ఎల్టా మండల స్థాయి పోటీలు

మహదేవపూర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : మండల స్థాయిలో జరిగిన ఎల్టా కార్యక్రమంలో భాగంగా ఉపన్యాస, ఒలంపియాడ్ రాత పరీక్ష ఎల్టా మండల కన్వీనర్ డి.బాలరాజు ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ బాయ్స్ మహదేవపూర్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలలో ఉపన్యాసం మొదటి బహుమతి ఎ.అశ్విత, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ మహదేవపూర్, ద్వితీయ బహు మతి ఆర్ అంజలీ జడ్పీహెచ్ఎస్ బొమ్మాపూర్ గెలుపొందారు. ఒలంపియాడ్‌లో ప్రథమ బహుమతి ఆర్.అంజలి జడ్పీహెచ్ఎస్ బొమ్మాపూర్ విజయం సాధించా రు. వీరిని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజిరెడ్డి, ఇన్‌చార్జి ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, గర్ల్స్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మధు అభినందించారు.

హనుమాన్ ఆలయంలో సంప్రోక్షణ పూజలు

మహదేవపూర్ రూరల్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : గత నెల రోజుల క్రితం అగ్నికి ఆహుతైన అంబట్‌పల్లి అమరేశ్వరాలయంలోని హనుమాన్ విగ్రహానికి శుక్రవారం దేవదాయశాఖ అధికారులు సంప్రోక్షణ పూజలు చేసి విగ్రహ పునః ప్రతిష్ఠ పూజలు నిర్వహించారు. ఉదయం నుండి హనుమాన్ విగ్రహానికి పలు విశిష్టపూజలు నిర్వహించి ఆలయంలో హోమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా ప్రమాదానికి గల కారణాలేంటనేది దేవదాయశాఖ అధికారులు ఇప్పటికి వెల్లడించలేదని పలువురు చెప్పుకొచ్చారు.

తహసీల్దార్‌గా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

వాజేడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా ఎస్ శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న వీరభద్ర ప్రసాద్ ఇటీవల ఉద్యోగ విరమణ చేయడంతో ఆయన స్థానంలో శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాస్ గతేడాది ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న సమయంలో వరదలు వచ్చాయి. ఆ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయనను కలెక్టరు కార్యాలయానికి బదిలీ చేశారు. ప్రస్తుత తహసీల్దార్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో మరల శ్రీనివాస్‌ను వాజేడు తహసీల్దార్‌గా కలెక్టరు నియమించారు.

వాజేడు ఎస్సైగా రాజ్‌కుమార్

వాజేడు, జనవరి 3(ఆంధ్రజ్యోతి): వాజేడు ఎస్సైగా రాజ్‌కుమార్ శుక్రవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. వాజేడు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రుద్రారపు హరీష్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా.. ఆయన స్థానంలో రెగ్యూలర్ ఎస్సైగా రాజ్‌కుమార్‌ను జిల్లా పోలీసు ఉన్నతాధికారులు నియమించారు.

మృతుల కుటుంబానికి పరామర్శ

మేడారం జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్‌లో ఇటీవల మృతి చెందిన పలువురు మృతుల కుటుంబాలను మాజీ జడ్పీచైర్ పర్సన్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి పరామర్శించారు. రంగాపూర్‌కు చెందిన బాడిషా చిన్న వీరయ్య తల్లి సమ్మక్క, గొగ్గలి పాపారావు, తోలెం సాయిలు వేరు వేరు కారణాలతో మరణించగా వారి కుటుంబాలను ఆమె పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె వెంట దుర్గం రమణయ్య, ఎట్టి జగదీష్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, దిడ్డి మోహన్‌రావు పాల్గొన్నారు.